శనివారం 29-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 379, పేజీలు: 4 | ₹ 6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

# ఢిల్లీలో రికార్డు స్థాయిలో వర్షపాతం

## 1936 తర్వాత కురిసిన భారీ వర్షపాతం

## ఎండలతో తల్లడిల్లిన ఢిల్లీ వాసులకు ఉపశమనం



ముందడుగు ఢిల్లీ:
రికార్డు స్థాయి ఎండలతో తల్లడిల్లిన ఢిల్లీ వాసులకు భారీ వర్షంతో ఉపశమనం లభించింది. గురువారం నుంచి ఢిల్లీ – ఎన్సీఆర్ ప్రాంతంలో భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకూ ఎడతెరిపి లేకుండా భారీ వర్షం పడింది. మూడు గంటల వ్యవధిలోనే ఢిల్లీలో 150 మిల్లీ మీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. 24 గంటల వ్యవధిలోనే రాజధానిలో 228.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ వెల్లడించింది. 1936 తర్వాత జూన్ నెలలో 24 గంటల వ్యవధిలో ఈ స్థాయిలో వర్షపాతం నమోదు కావడం ఇదే తొలిసారని పేర్కొంది. 1936 జూన్ 28న సఫ్దర్‌జంగ్ అబ్జర్వేటరీలో 24 గంటల వ్యవధిలో 235.5 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. ఆ తర్వాత ఇప్పుడు 228.1 మి.మీ వర్షం పడినట్లు మిగతా 2లో

# నీట్ రద్దు చేయాలంటూ ఏకగ్రీవ తీర్మానం

## తమిళనాడు అసెంబ్లీ ఆమోదం



ముందడుగు తమిళనాడు:
తమిళనాడు అసెంబ్లీ నీట్ రద్దు చేయాలంటూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. నీట్‌ను రద్దు చేయాలని, నీట్ అమలుకు ముందు మాదిరిగా 12వ తరగతి మార్కుల ఆధారంగా మెడికల్ అడ్మిషన్లు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలను అనుమతించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. నీట్-యూజీ 2024 ఎగ్జామ్ పేపర్ లీక్, నీట్-పీజీ 2024 పరీక్షను ఆకస్మికంగా వాయిదా వేయడంపై అభ్యర్థుల్లో గందరగోళం నెలకొన్నది. ఈ తరుణంలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ శుక్రవారం నీట్ రద్దు తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మణితనేయ మక్కల్ కట్చి, మిగతా 2లో




భారీగా పెరిగిన రీఛార్జ్ ధరలు

వివరాలు 2లో




సైకిల్ చక్రాల్లాంటివారు స్త్రీ, పురుషులు

వివరాలు 3లో



హైకింగ్‌తో సాహసాలు చేద్దామా..!

వివరాలు 4లో



భాగ్యశ్రీ జోరు మామూలుగా లేదు

వివరాలు 5లో

# జార్ఖండ్ మాజీ సోరెన్‌కు భారీ ఊరట

## బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు



ముందడుగు జార్ఖండ్:
భూ కుంభకోణం కేసులో అరెస్టైన జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు భారీ ఊరట లభించింది. ఆయనకు జార్ఖండ్ హైకోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. దీంతో రాంచీలోని బిర్సా ముండా జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆయన హైకోర్టు తీర్పుతో ఐదు నెలల తర్వాత జైలు నుంచి బయటకు రానున్నారు. జార్ఖండ్ ముఖ్యంమత్రిగా ఉన్న హేమంత్ సోరెన్‌ను భూ మిగతా 2లో

# జలమయంగా దేశ రాజధాని ఢిల్లీ

- నీటితో నిండిన ఎంపీల నివాసాలు
- ఎంపీని ఎత్తుకొని కారులో కూర్చోపెట్టారు



ముందడుగు జాతీయం:
దేశరాజధాని ఢిల్లీలో భారీ వర్షా ల కారణంగా జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల కోసం ఎంపీలంతా ప్రస్తుతం నగరంలోనే ఉన్నారు. ఈ వర్షా లతో వారి నివాసాలు మిగతా 2లో

ముందడుగు
శనివారం,
29-6-2024,
హైదరాబాద్

# ఢిల్లీలో రికార్డు స్థాయిలో వర్షపాతం

మొదటిపేజీ తరువాయి:
వివరించింది. భారీ వర్షం కారణంగా ఢిల్లీ తడిసి ముద్దైంది. రోడ్లన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆజాద్ మార్కెట్ అండర్ పాస్ వద్ద పలు లారీలు నీట మునిగాయి. నోయిడా, ఘజియాబాద్ ప్రాంతాల్లో కూడా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షా లకు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. దీంతో ఉదయం కార్యాలయాలకు వెళ్లే వారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మరోవైపు శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో టెర్మినల్ 1 పైకప్పు కొంత భాగం కూలిపోయి కార్లపై పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. టెర్మినల్-1లోని పైకప్పు కూలడం వల్ల విమాన రాకపోకలపైనా ప్రభావం పడింది. అక్కడి నుంచి బయలుదేరాల్సిన విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ముందు జాగ్రత్తగా చెకిన్ కౌంటర్లు మూసివేశామని చెప్పారు.

# తీహార్ జైల్లో కవితను కలిసిన హరీష్ రావు

## ధైర్యంగా ఉండాలని సూచన

ముందడుగు ఢిల్లీ:
ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన కల్వకుంట్ల కవితను శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీష్ రావు ములాఖత్ అయ్యారు. ఆమె యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంలో మనీలాండరింగ్‌కు పాల్పడిన ఆరోపణలను కవిత ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది మార్చి 15వ తేదీన అయ్యారు. జ్యుడీషియల్ కస్టడీలో కొనసాగుతున్నారు. తీహార్ జైలులో ఉంటూ ఈడీ విచారణను ఎదుర్కొంటోన్నారు. ఇదే కేసులో సీబీఐ అధికారులు సైతం కవితను అరెస్ట్ చేసింది. ఈడీ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీ జులై 3వ తేదీ వరకు కొనసాగాల్సి ఉంది. ఆ తరువాత ఆమెను ఢిల్లీ రోస్ అవెన్యూ న్యాయస్థానం ముందు ప్రవేశపెడతారు ఈడీ అధికారులు. కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నందున కస్టడీని మరి కొంతకాలం పొడిగించాలని కోరే అవకాశాలు లేకపోలేదు.





# జలమయంగా దేశ రాజధాని ఢిల్లీ

మొదటిపేజీ తరువాయి:
కూడా నీటిలో చిక్కుకుపోయాయి. నీటి ఎద్దడి పరిష్కరించాలంటూ ఇటీవల నిరాహారదీక్ష చేసిన ఆప్ నేత, ఢిల్లీ జలమంత్రి ఆతిశీ ఇల్లు కూడా వాటిల్లో ఉంది. తన ఇంట్లోని సామాన్లన్నీ పాడైపోయాయని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ఎక్స్(ట్విటర్) వేదికగా వెల్లడించారు. ఈ వర్షా లతో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్‌కు ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. లోధి ఎస్టేట్ ప్రాంతంలోని నివాసం వద్ద నీరు నిలవడంతో సిబ్బంది ఆయన్ను ఎత్తుకొని కారులో కూర్చోపెట్టారు. పార్లమెంట్‌కు వెళ్లేందుకే ఇదంతా అని యాదవ్ వెల్లడించారు. తన ఇల్లంతా నీటితో నిండిపోయిందని, రెండు రోజుల క్రితం చేసిన ఫ్లోరింగ్ అంతా పాడైపోయిందని చెప్పారు. ఫ్లోరింగ్ కోసం వెచ్చించిన సొమ్మంతా వృథా అయిందన్నారు. నీటిని తోడేందుకు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి ఫోన్ చేసిన ప్రయోజనం లేకపోయిందన్నారు. ఈ పరిస్థితులపై ఢిల్లీ కౌన్సిలర్, భాజపా నేత రవీందర్ సింగ్ నేగి మాట్లాడుతూ.. "అన్ని కాలువలు పొంగిపొర్లుతున్నాయి. వర్షా కాలానికి ముందు వాటిలో పేరుకుపోయిన చెత్తను తీయకపోవడమే ఈ పరిస్థితికి కారణం" అని ఆరోపించారు.

# భారీగా పెరిగిన రీఛార్జ్ ధరలు

## జియో బాటలోనే పెంచిన ఎయిర్‌టెల్




ముందడుగు జాతీయం:
వినియోగదారులకు టెలికాం సంస్థలు వరసగా తమ రీఛార్జ్ ధరలను పెంచుతూ షాక్ ఇస్తున్నాయి. గురువారం జియో రీఛార్జ్ రేట్లను పెంచగా, తాజా ఎయిర్‌టెల్ కూడా అదే బాటలో నడిచింది. శుక్రవారం మొబైల్ టారిఫ్‌లను పెంచుతున్నట్లు ఎయిర్ టెల్ ప్రకటించింది. జూలై 3 నుంచి 10-21 శాతం ధరలు8 పెరుగుతున్నట్లు ప్రకటించింది. రిలయన్స్ జియో మొబైల్ టారిఫ్‌లలో 12-27 శాతం పెంపును ప్రకటించిన ఒక రోజు తర్వాత ఇది వచ్చింది. రెండున్నరేళ్ల తర్వాత టెలికాం సంస్థలు వినియోగదారుడిపై భారాన్ని మోపాయి. అపరిమిత వాయిస్ ప్లాన్‌లలో, ఎయిర్‌టెల్ టారిఫ్‌ను రూ.179 నుండి రూ.199కి, రూ.455 నుంచి రూ.599కి, రూ.1,799 నుంచి రూ.1,999కి పెంచినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. భారతదేశంలో టెల్కోలకు ఆర్థికంగా ఆరోగ్యకరమైన వ్యాపార నమూనాలను ప్రారంభించేందుకు ప్రతీ వినియోగదారుడిపై ఆవరేజ్ రెవెన్యూ పర్ యూజర్(ARPU) రూ. 300 కంటే ఎక్కువగా ఉండాలని భారతీ ఎయిర్‌టెల్ మీడియా ప్రకటనలో తెలిపింది. జియో ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు డిసెంబర్ 2021లో మొబైల్ సర్వీస్ రేట్లను పెంచాయి. అంతకుముందు 2019లో టెలికాం సంస్థలు రేట్లను 20-40 శాతం పెంచాయి. 2021లో 20 శాతం పెంచాయి.

# నీట్ రద్దు చేయాలంటూ ఏకగ్రీవ తీర్మానం

మొదటిపేజీ తరువాయి:
మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కజగం, తమిళగ వెట్రి కజగం, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) సహా పలు ప్రాంతీయ పార్టీలు ఈ తీర్మానానికి మద్దతు తెలిపాయి. మరోవైపు దేశవ్యాప్తంగా మెడికల్ అడ్మిషన్ల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించిన నీట్ నుంచి మినహాయించాలన్న తమిళనాడు డిమాండ్‌ను డీఎంకే ఎంపీ కనిమొళి ఢిల్లీలో పునరుద్ఘాటించారు. 'మాకు నీట్ వద్దు అని తమిళనాడు స్పష్టంగా చెబుతోంది. నీట్ సరైన పరీక్ష కాదని ఇప్పుడు రుజువైంది. నీట్ వల్ల విద్యార్థులు చాలా నష్టపోతున్నారు' అని మీడియాతో ఆమె అన్నారు. గతంలో నీట్ మినహాయింపుతో పాటు తాజాగా నీట్ రద్దు చేయాలన్న తీర్మానాన్ని రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిందని వెల్లడించారు.

# జార్ఖండ్ మాజీ సోరెన్‌కు భారీ ఊరట

మొదటిపేజీ తరువాయి:
కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జనవరి 31న అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. విచారణలో అధికారులు అడిగిన ప్రశ్నలకు సోరెన్ సమాధానం దాటవేస్తున్న క్రమంలో మనీలాండరింగ్ నియంత్రణ చట్టం(పీఎంఎల్ఏ) కింద ఆయన్ను కస్టడీలోకి తీసుకున్నారు. అప్పటి నుంచి జైల్లోనే ఉన్న ఆయన దాదాపు ఐదు నెలల తర్వాత ఇప్పుడు బెయిల్‌పై బయటకు రాబోతున్నారు. కాగా, అరెస్ట్ అనంతరం సోరెన్ సీఎం పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన స్థానంలో జార్ఖండ్ ముఖ్యమంత్రిగా చంపై సోరెన్ బాధ్యతలు చేపట్టారు.

ముందడుగు
శనివారం,
29-6-2024,
హైదరాబాద్

# సైకిల్ చక్రాల్లాంటివారు స్త్రీ, పురుషులు

## లింగ సమానత్వంపై ఎంపీ సుధామూర్తి

ముందడుగు జాతీయం:
స్త్రీ, పురుషులిద్దరూ సైకిల్‌కు ఉన్న రెండు చక్రాల్లాంటివారన్నారని, లింగ సమానత్వంపై ప్రముఖ రచయిత్రి, సమాజ సేవకురాలు, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒక చక్రం సాయం లేకుండా మరో చక్రం ముందుకెళ్లదన్నారు. అలాగే స్త్రీ, పురుషులిద్దరూ సమానమే అన్నారు. కానీ, వారి వారి మార్గాల్లో ప్రత్యేకంగా ఉంటారని వివరించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు. సమానత్వం అంటే ఏమిటి..? ముందుగా దానికో నిర్వచనం తెలుసుకోవాలన్నారు. పురుషుల కంటే మహిళలు చాలా భిన్నంగా ఉంటారని వివరించారు. స్త్రీలకు పలు భాషల్లో ప్రావీణ్యం ఉంటుందన్నారు. పరిస్థితుల్ని చక్కబెట్టగలరని, అర్థం చేసుకునే స్వభావం వారికి



ఉంటుందన్నారు. అదే పురుషుల విషయానికొస్తే.. వారు మహిళలంత భావోద్వేగులు కాదని అభిప్రాయపడ్డారు. 'పురుషుల్లో మంచి ఇంటెలిజెంట్ కోషెంట్ ఉండొచ్చు కానీ, మంచి ఈక్యూ (ఎమోషనల్ కోషెంట్) ఉండదు' అని సుధామూర్తి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది.

# రాజ్యసభలో కళ్లు తిరిగి పడిపోయిన ఎంపీ

## హుటాహుటిన అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలింపు


ముందడుగు ఢిల్లీ:
రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సీనియర్ నాయకురాలు ఫూలోదేవి నేతమ్ సభలో కళ్లుతిరిగి పడిపోయారు. నీట్ పరీక్షలో అవకతవకలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ సభ్యులంతా రాజ్యసభ ఛైర్మన్ వెల్‌లోకి వెళ్లి నిరసన వ్యక్తం చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఫూలోదేవి కళ్లు తిరిగి కిందపడిపోగానే సాటి సభ్యులు, రాజ్యసభ సిబ్బంది హుటాహుటిన ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లారు.



ఆమెతోపాటు మరికొందరు మహిళా ఎంపీలు కూడా వెళ్లారు. ప్రస్తుతం ఆమె ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# నిండు గర్భిణీ ప్రాణం తీసిన నకిలీ డాక్టర్

## నకిలీ డాక్టర్లపై పోలీసుల కేసు నమోదు



ముందడుగు ఉత్తరప్రదేశ్:
నకిలీ వైద్యుల తప్పుడు ఇంజెక్షన్ కారణంగా నిండు గర్భిణీ మరణించింది. కడుపులోని శిశువు కూడా చనిపోయింది. వైద్య దర్యాప్తులో ఈ విషయం నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో నకిలీ డాక్టర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని భదోహి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. విక్రమ్‌పూర్ ప్రాంతానికి చెందిన 23 ఏళ్ల అంచల్‌కు నెలలు నిండాయి. దీంతో కాన్పు కోసం ప్రైవేట్ హాస్పిటల్‌లో ఆమెను అడ్మిట్ చేశారు. ఆసుపత్రి డాక్టర్లు వినయ్ కుమార్ పాండే, శివ్ బహదూర్ యాదవ్ ఆపరేషన్ కోసం రూ.50,000 కట్టించుకున్నారు. ప్రసవం కోసం అంచల్‌కు ఒక ఇంజెక్షన్ ఇచ్చారు. అస్వస్థతకు గురైన ఆమెతోపాటు కడుపులోని పిండం కూడా మరణించింది. ఆసుపత్రిలో ఆక్సిజన్ లేదంటూ ఆ ఇద్దరు డాక్టర్లు అక్కడి నుంచి పారిపోయారు. మరోవైపు తప్పుడు ఇంజెక్షన్ కారణంగా దళిత గర్భిణీ అంచల్ చనిపోయినట్లు ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో భదోహి చీఫ్ మెడికల్ ఆఫీసర్ సంతోష్ కుమార్ దీనిపై దర్యాప్తు జరిపించారు. ఆ ప్రైవేట్ ఆసుపత్రికి ఎలాంటి లైసెన్స్ లేదని, డాక్టర్ల డిగ్రీలు నకిలీ అని గుర్తించారు. తప్పుడు ఇంజెక్షన్ కారణంగానే నిండు గర్భిణీ, ఆమె కడుపులోని పిండం మరణించినట్లు పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో నిర్ధారణ అయ్యింది. దీంతో నకిలీ డాక్టర్లపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న వారిద్దరి కోసం పోలీసులు వెతుకున్నారు.

# బీమా ఆఫర్‌ను పునర్నిర్వచిస్తున్న హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో

HDFC ERGO

ముందడుగు హైదరాబాద్:
భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ సాధారణ బీమా సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, తన ప్రధాన కార్యాచరణ వ్యాపార ప్రక్రియల పునరుద్ధరణతో ఒక మైలురాయి చొరవను సగర్వంగా ప్రకటిస్తోంది. డక్ క్రీక్ ప్లాట్‌ఫారమ్‌కు చెందిన నూతన-తరపు సాంకేతిక సామర్థ్యాలను ఉపయోగించుకోవడం, భారీ కార్యాచరణ సామర్థ్యాలతో 'డిజిటల్ ఫస్ట్' బీమా సంస్థ నిబద్ధత దిశగా సంస్థ ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది.

సిస్టమ్ స్వీకరణపై హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ డైరెక్టర్ మరియు చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పార్థనిల్ ఘోష్ మాట్లాడుతూ, "భారతదేశంలో ఒక ప్రముఖ జీవితేతర బీమా సంస్థగా, మా వినియోగదారులకు ఉన్నతమైన, హైపర్ పర్సనలైజ్డ్ పరిష్కారాలను అందించడానికి కట్టుబడి ఉన్నాము. నూతన-తరపు డిజిటల్ సొల్యూషన్స్‌తో, అధునాతన టెక్నాలజీ ప్లాట్‌ఫారమ్‌కు అనుగుణంగా మారవలసిన ప్రాముఖ్యతను మేము అర్థం చేసుకున్నాము. నిరంతరం అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో మా వినియోగదారులకు మరింత విలువను అందించాలనే లక్ష్యంతో, మేము డక్ క్రీక్‌తో ఏడాదిన్నర క్రితం ఈ ప్రయాణాన్ని ప్రారంభించామని అన్నారు.

# బిల్డర్ల కంటే ఆర్కిటెక్ట్‌లదే కీలక పాత్ర

## ఐఐఐడి ఇంటీరియర్ డిజైనర్ల ఐదవ ఎక్స్‌పో ప్రారంభం



ముందడుగు హైదరాబాద్:
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఇంటీరియర్ డిజైనర్స్, హైదరాబాద్ చాప్టర్‌లోని ఆర్కిటెక్ట్‌లు మరియు ఇంటీరియర్ డిజైనర్లచే నిర్వహించబడిన ఎక్స్‌పో ఐదవ ఎడిషన్‌ను డిజైన్ ఇంటెలిజెన్స్ థీమ్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. వారితో పాటు ఆర్ అండ్ బి ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ఐఐఐడి జాతీయ అధ్యక్షుడు సరోష్ వాడియా హాజరయ్యారు. సాయంత్రం జరిగిన ఫెలోషిప్ మీట్‌లో, దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌కు చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్ పీటర్ రిచ్, ఆర్. హెచ్‌ఐసిసిలో లోటస్ ఆర్కిటెక్ట్స్ సిద్ధార్థ్ తల్వార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ 50 ఏళ్ల ఐఐఐడీ చరిత్రలో ఐఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 2024 5వ ఎడిషన్‌ను స్వాగతిస్తున్నామని, భారతదేశంలోని మెట్రోపాలిటన్ నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉన్నందున ఇలాంటి మరిన్ని ప్రదర్శనలను ఆహ్వానిస్తున్నామన్నారు. బిల్డర్ల కంటే ఆర్కిటెక్ట్స్ పాత్ర చాలా ముఖ్యమైనదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఐడి-హెచ్‌ఆర్సీ ఛైర్‌పర్సన్ పల్లవి అంచూరి, రాకేష్ వాసు తదితరులు పాల్గొన్నారు.

ముందడుగు
శనివారం, 29-6-2024, హైదరాబాద్

# నటి తమన్నా ఏమైనా పోరాటయోధురాలా?

## పాఠ్య పుస్తకాల్లో తమన్నా జీవిత చరిత్ర

## విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం



ముందడుగు కర్ణాటక: మిల్కీ బ్యూటీ తమన్నా జీవిత చరిత్రను కర్ణాటకలో పిల్లలు చదువుకునే పాఠ్య పుస్తకాల్లో పెట్టారు. దీంతో ఈ విషయం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. సినిమాల్లో ప్రేక్షకుల్ని అలరింపజేసే నటి తమన్నా జీవితం పిల్లల పాఠంగా ఉండటం వివాదాస్పదంగా మారింది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు కూడ ఫైర్ అవుతున్నారు. ఆమె ఏమైనా పోరాటయోధురాలా? అంటూ మండిపడుతున్నారు. కర్ణాటకలోని బెంగళూరులో హెబ్బళ సింధీ అనే ఉన్నత పాఠశాల పుస్తకాల్లో 7th క్లాస్ పిల్లల పాఠ్యాంశంగా నటి తమన్నా భాటియా లైఫ్ స్టోరీ కనిపించింది. ఈ పాఠ్యాంశం మరేదో కాదు.. దేశ విభజన జరిగిన తర్వాత సింధీ వర్గానికి చెందిన కొందరి ప్రముఖుల గురించి చెప్పేది. అందువల్ల అదే సింధీ వర్గానికి చెందిన తమన్నా భాటియా, బాలీవుడ్ యాక్టర్ రణ్‌వీర్ సింగ్‌ల గురించి ఆ పాఠ్య పుస్తకాల్లో లిఖించారు. దీంతో ఇది చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు భగ్గుమన్నారు. ఒక హీరోయిన్ పిల్లలకు ఏవిధంగా ఆదర్శప్రాయురాలు అవుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. అంతేకాకుండా అక్కడి ప్రైవేటు పాఠశాలల సంఘాలు కూడా ఈ వ్యవహారంపై అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఈ వివాదం తీవ్ర దుమారం రేపడంతో కర్ణాటక విద్యాశాఖ స్పందించింది. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకుంటామని తెలిపింది. విద్యాశాఖతో పాటు హెబ్బళ సింధీ ఉన్నత పాఠశాల యాజమాన్యం కూడా రియాక్ట్ అయింది. ఈ మేరకు సింధీ వర్గానికి చెందిన నటి తమన్నా సినీ రంగంలో ఎన్నో విజయాలు సాధించిందని.. అత్యున్నత స్థాయికి చేరడం ద్వారా తమన్నా జీవితాన్ని పాఠ్య పుస్తకాల్లో పెట్టామని చెప్పుకొచ్చింది. అయితే ఇదే వ్యవహారంపై పోలీస్ స్టేషన్‌లో కూడా కేసు నమోదు అయింది.

# హైకింగ్‌తో సాహసాలు చేద్దామా..!

- వర్షాకాలంలో మనసును ఉత్తేజ పరుస్తుంది
- ఆరోగ్యానికి ఎన్నో మంచి ప్రయోజనాలు..



ముందడుగు ప్రత్యేకం: వర్షా కాలం చినుకు పడితే చాలు ప్రకృతి అంతా పచ్చదనంతో నిండిపోతుంది. ఆహ్లాదకరమైన వాతావరణంతో అందంగా ఉంటుంది. ఈ సమయంలో బయట గాలికి తిరగడం, హైకింగ్ వంటి సాహసాలు చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిది అని నిపుణులు చెబుతున్నారు. తరచూ ఉండే పనుల నుంచి విశ్రాంతి కోసం ఇటువంటి సాహసాలు చేయడం వల్ల మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండవచ్చని అంటున్నారు. ప్రకృతి నుండి వచ్చే ఆహ్లాదకరమైన గాలి, సువాసనతో మనసును హాయిగా ఉంచుకోవచ్చు.

### ప్రకృతితో విడదీయలేని సంబంధం

ప్రకృతిలో ఉండే రకరకాల దృశ్యాలను చూడడానికి హైకింగ్ వంటివి అద్భుతమైన అనుభవాలు అని చెప్పవచ్చు. హిమాలయాలు, కొండప్రాంతాల్లో చేసే ఈ హైకింగ్ వల్ల సలహమైన ప్రకృతి అందాలు చూసి మానసికంగా ఎంతో ఆనందం కలుగుతుంది. అంతేకాదు ఇలాంటి సాహసాలు శరీరానికి వ్యాయామం చేసిన ఫీలింగ్ ఏర్పరుస్తుంది. కొండ ప్రాంతాలపైకి ఎక్కడం వల్ల కలిగే అనుభూతితో మానసికంగా ఏర్పడే సంతోషంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ముఖ్యంగా ఈ హైకింగ్ చేసే వారిలో చాలా రకాల మానసిక ఆరోగ్యాలు నయమైనట్లు నిపుణులు చెబుతున్నారు. మానసికంగా సంతోషంగా ఉండేవారు శారీరకంగా ఎటువంటి అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే అవకాశాలు కూడా తక్కువే అని అంటున్నారు. తరచూ ఆఫీసుల్లో పని ఒత్తిడికి లోనయ్యే వారు ఇలాంటి చిన్న చిన్న బ్రేక్స్ తీసుకుని పర్యటనలకు వెళ్లడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చు.

### గుండెకు మంచి ఆరోగ్యం

హైకింగ్ అనేది హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఒక అద్భుతమైన మార్గం అని నిపుణులు చెబుతున్నారు. శరీర సామర్థ్యత, సమతుల్యతను పెంచడానికి తోడ్పడుతుంది. హృదయ స్పందన రేటును పెంచడమే కాకుండా, రక్త ప్రసరణను కూడా మెరుగుపరుస్తుంది. హైకింగ్ చేసే వారికి గుండెపోటు వంటి గుండె సంబంధింత సమస్యలలు రావడం చాలా తక్కువ అని అంటున్నారు.

### మెరుగైన మానసిక స్థితి

హైకింగ్ మానసిక స్థితి, భావోద్వేగ శ్రేయస్సుపై శక్తివంతమైన ప్రభావాన్ని చూపుతుంది. శారీరక శ్రమ, సాధారణంగా, ఎండార్ఫిన్ల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. హైకింగ్ చేస్తున్న సమయంలో సూర్యరశ్మికి ఉండడం వల్ల శరీరంలో విటమిన్ డి ఉత్పత్తి పెరుగుతుంది. ఇది మానసిక స్థితి నియంత్రణకు కీలకం. శారీరకంగా అలసిపోయినా కూడా మానసికంగా చాలా ఆహ్లాదకరంగా ఉంటారని నిపుణులు అంటున్నారు.

# మాన్‌సూన్ సర్వీస్ క్యాంపెయిన్‌ను ప్రారంభించిన బిఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా

ముందడుగు హైదరాబాద్: గురుగ్రామ్. తన డీలర్ నెట్‌వర్క్ ద్వారా మాన్‌సూన్ సర్వీస్ క్యాంపెయిన్‌ను ప్రారంభించామని బిఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రకటించింది. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని భారతదేశం వ్యాప్తంగా నిర్వహిస్తుండగా, రాబోయే వర్షా కాల సీజన్‌లో కారు పూర్తిగా సంసిద్ధతను ఇది నిర్ధారిస్తుంది. మిస్టర్ విక్రమ్ పవాహ్, ప్రెసిడెంట్, బిఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా మాట్లాడుతూ "విశిష్ట వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు మా వినియోగదారుల వాహనాలు అత్యుత్తమ స్థితిలో ఉన్నాయని నిర్ధారించేందుకు బిఎండబ్ల్యూ గ్రూప్ కట్టుబడి ఉంది. మా మాన్‌సూన్ సర్వీస్ క్యాంపెయిన్ బిఎండబ్ల్యూ మరియు మినీ కార్ల భద్రతను, పనితీరును మెరుగుపరచడానికి క్షుణ్ణమైన ఇన్‌స్పెక్షన్‌లు, మెయింటెయినెన్స్ మరియు అవసరమైన అప్‌గ్రేడ్‌లను అందించేలా రూపొందించాము. మా వినియోగదారులకు విశ్వసనీయత, మనశ్శాంతిల ప్రాముఖ్యతను మేము అర్థం చేసుకున్నామని తెలిపారు.




ముందడుగు
శనివారం, 29-6-2024, హైదరాబాద్

# యాక్షన్‌తో రఫ్ఫాడిస్తుంది



ఇటీవలే 'అరణ్మనై-2' (తెలుగులో 'బాక్') చిత్రంలో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది అగ్ర కథానాయిక తమన్నా. కథాంశాల ఎంపికలో కొత్తదనానికి పెద్దపీట వేస్తూ కెరీర్‌లో దూసుకుపోతుందీ భామ. తాజా తెలుగు చిత్రం 'ఓదెల-2'లో ఈ అమ్మడు యాక్షన్ విన్యాసాలతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నది. అశోక్‌తేజ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మధు క్రియేషన్స్, సంపత్‌నంది టీమ్ వర్క్స్ నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలకమైన యాక్షన్ ఎపిసోడ్స్‌ను తెరకెక్కిస్తున్నారు. ఈ సన్నివేశాల కోసం తమ న్నా ప్రత్యేక శిక్షణ తీసుకుందని, ఆమెలోని ఇంటెన్స్ యాక్షన్ కోణాన్ని ఆవిష్కరించే చిత్రమవుతుందని దర్శకుడు తెలిపారు. 'ఓదెల' చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిస్తున్న ఈ సినిమా యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంభరితంగా సాగుతుందని నిర్మాతలు తెలిపారు. హెబ్బాపటేల్, వశిష్ట ఎన్ సింహ, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్‌రాజన్ ఎస్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాత: డి.మధు, దర్శకత్వం: అశోక్‌తేజ.

# సుప్రీం యాస్కిన్ బీభత్సకాండ సెకండ్‌పార్ట్‌లో



'కల్కి 2898 ఏడీ' సినిమా చూసిన ప్రేక్షకుల్లో చర్చనీయాంశంగా మారిన పాత్ర 'సుప్రీం యాస్కిన్'. రెండొందల ఏళ్ల రాక్షసుడు యాస్కిన్‌గా కమల్‌హాసన్ ఒదిగిపోయి నటించారు. నమ్మశక్యం కాని ఆయన రూపం ప్రేక్షకుల్లో చర్చకు దారితీసింది. దర్శకుడు నాగ్‌అశ్విన్ ఒకే సెట్‌లో గ్రీన్‌మ్యాట్ వేసి కమల్ సీన్స్ అన్నీ తీసేశాడు. సకలకళా వల్లభుడైన కమల్.. విలన్‌గా కూడా విశ్వరూపం చూపించేశాడు. రీసెంట్‌గా ఈ సినిమాను ఆయన చెన్నయ్‌లో తిలకించారు. ఆ తర్వాత తన పాత్ర గురించి ప్రత్యేకంగా మీడియాతో ముచ్చటించారు. ' 'కల్కి' రెండవభాగంలో నా పాత్ర అధికంగా ఉంటుంది. ఈ పాత్రను అంగీకరించడానికి ఏడాది పాటు ఆలోచించా. అసలు ఈ పాత్ర చేయగలనా అనే సందేహం కూడా కలిగింది. దర్శకుడు నాగీకి సహనం ఎక్కువ. అందరితో అద్భుతంగా చేయించుకున్నాడు. పురాణాలకు సైన్స్‌ని ముడిపెట్టి తెరపై ఓ అద్భుతాన్ని ఆవిష్కరించాడు. ఎంత ఓపిగ్గా కథ రాసుకున్నాడో అంతే ఓపిగ్గా తెరకెక్కించాడు. దాని ప్రతిఫలమే ఈ విజయం. సుప్రీం యాస్కిన్ బీభత్సకాండను సెకండ్ పార్ట్‌లో చూస్తారు' అన్నారు కమల్‌హాసన్.



# భాగ్యశ్రీ జోరు మామూలుగా లేదు

నక్కతోక తొక్కి టాలీవుడ్‌లోకి అడుగుపెట్టినట్టుంది పూణే భామ భాగ్యశ్రీబోర్సే. తెలుగులో ఈ ముద్దుగుమ్మ నటించిన ఒక్క సినిమా కూడా ఇంతవరకూ విడుదల కాలేదు. కానీ అవకాశాలు మాత్రం వరుస పెట్టాయి. దానికి కారణం కేవలం భాగ్యశ్రీ అందమే. లుక్ పరంగా తెలుగు నేటివిటీకి దగ్గరగా ఉండటం కూడా ఓ కారణం కావొచ్చు. రవితేజ 'మిస్టర్ బచ్చన్'లో భాగ్యశ్రీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా విడుదల కాకుండానే మరో మూడు తెలుగు సినిమాలకు సంతకం చేసేసింది ఈ అందాలభామ. అందులో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా ఒకటి. ఈ సినిమా షూటింగ్‌లో కూడా ఇప్పటికే భాగ్యశ్రీ పాల్గొన్నట్టు తెలుస్తున్నది. ఇక రెండో సినిమా నానిది. ఆయన హీరోగా సుజిత్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. అందులో కూడా భాగ్యశ్రీబోర్సేనే కథానాయిక. వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. అలాగే.. 'లక్కీభాస్కర్' తర్వాత దుల్కర్ సల్మాన్ మళ్లీ తెలుగులోనే ఓ సినిమా చేయనున్నారట. రవి అనే కొత్త దర్శకుడు తెరకెక్కించనున్న ఈ సినిమాలో కూడా భాగ్యశ్రీబోర్సేనే కథానాయికగా కన్ఫర్మ్ అయ్యిందట. ఈ సినిమా ప్రకటన త్వరలో రానుంది. ఈ అందాలభామ జోరు చూస్తుంటే, అనతికాలంలోనే టాలీవుడ్ టాప్ హీరోయిన్ అనిపించుకునేలా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.